# సాక్షి


## అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 30 । జూలై । 2023




### 'గొడుగు'ల సంత

ముంచంగిపుట్టులో వారపు సంతకు ముసురు వల్ల ఛత్రాలతో రావడంతో గొడుగుల సంతను తలపించింది.



### విస్తారంగా వర్షాలు

జిల్లా వ్యాప్తంగా ఈదురుగాలులతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. 8లో



### ముమ్మరంగా తనిఖీలు

మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో పోలీసు బలగాలు గాలింపు చర్యలు, తనిఖీలు ముమ్మరం చేశాయి. 8లో

## న్యూస్‌రీల్


### భక్తిశ్రద్ధలతో మొహర్రం



పాడేరు పురాతన మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

సాక్షి, పాడేరు: మొహర్రంను భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. పాడేరులోని పురాతన మసీదుతో పాటు జమాత్ తదితర మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్‌లు మొహర్రం గురించి వివరించారు. మహ్మద్ ప్రవక్త మనువుడు ఇమామ్ హుసేన్ త్యాగాన్ని తెలియజేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని అరకులోయ, జోలాపుట్టు, పెదబయలు, హుకుంపేట, డుంబ్రిగుడ, గుత్తులపుట్టు, జి.మాడుగుల, చింతపల్లి, కొయ్యూరు, రంపచోడవరం, చింతూరు ప్రాంతాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

### బతుకు నావ



శబరి నదిలో చేపల వేటలో జాలర్లు

చింతూరు: గంగమ్మతల్లిని నమ్ముకుని జీవనం సాగిస్తుంటారు జాలర్లు. వానొచ్చినా.. వరదొచ్చినా చేపల వేట వారికి ఆధారం. ఒక పక్క శబరి వరద గ్రామాలను ముంచెత్తుతుంటే అదే నదిలో బతుకు నావ సాగిస్తూ జాలర్లు ఇలా కనిపించారు.

### ఆలయ నిర్మాణానికి వినతి



వైవీ సుబ్బారెడ్డికి వివరిస్తున్న సుభద్ర దంపతులు

మహారాణిపేట (విశాఖ): అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలంలో సెల్లూం కొండపై శ్రీ వరాహ నృసింహ స్వామి వారి ఆలయ నిర్మాణానికి నిధులు కేటాయించాలని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయ కర్త వైవీ సుబ్బారెడ్డిని విశాఖ ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మూర్తి దంపతులు కోరారు. శనివారం ఆయనను సర్క్యూట్ హౌస్‌లో కలిశారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు మూడు ఎకరాలు ఇచ్చారని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన టీటీడీ ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలను సిద్ధం చేయిస్తామని హామీ ఇచ్చారని జెడ్పీ చైర్‌పర్సన్ తెలిపారు.

### డీసీసీబీ చైర్మన్‌కు అభినందనలు



అభినందనలు తెలుపుతున్న భాగ్యలక్ష్మి దంపతులు

సాక్షి,పాడేరు: డీసీసీబీ చైర్మన్, విశాఖపట్నం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా నియమితులైన కోలా గురువులకు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ టి.నరసింగరావు అభినందనలు తెలిపారు. విశాఖలో శనివారం ఆయనను ఎమ్మెల్యే దంపతులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

# వరద ఉగ్రరూపం

- గ్రామాల్లోకి ప్రవేశిస్తున్న గోదావరి, శబరి నీరు
- ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న ప్రజలు
- సహాయక చర్యలు ముమ్మరం చేసిన ప్రభుత్వం
- లాంచీలు, పడవల్లో కూరగాయలు, పాలు తరలింపు

గోదావరి, శబరినదుల వరద విలీన మండలాలను ముంచెత్తుతోంది. వరద నీరు క్రమేపీ పెరుగుతూ చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లోని పలు గ్రామాల్లోకి చేరుతోంది. దీంతో నాలుగు మండలాల్లో ఆందోళనకు గురైన ప్రజలు ఇళ్లను ఖాళీచేసి పునరావాస కేంద్రాలు, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు. బాధితులకు బాసటగా ఉంటూ ప్రభుత్వం సహాయక చర్యలు ముమ్మరం చేసింది. ఇల్లు ఖాళీ చేసిన వారికి రూ 2 వేలు, ఇల్లు దెబ్బతిన్న వారికి రూ.10వేల చొప్పున సీఎం ఆదేశాల మేరకు ఇవ్వనున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.



గోదావరి, శబరి నదుల వరద ఉధృతికి వీఆర్‌పురం, కూనవరం నడుమ నీటమునిగిన వంతెన

చింతూరు: ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో గోదావరి పెరుగుతుండడంతో పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలను వరదనీరు ముంచెత్తుతోంది. ఎటపాక మండలంలోని నందిగామ, వీరాయిగూడెం, కూనవరం మండలంలో కూనవరం, టేకులబోరు, శబరికొత్తగూడెం, కొండ్రాజుపేట, వీఆర్‌పురం మండలంలో శ్రీరామగిరి, వడ్డిగూడెం, ధర్మతాళ్లగూడెం, జీడిగుప్ప, ఇప్పూరు, పోచవరం, తుమ్మిలేరు, కొండేపూడి, కొల్లూరు, గొందూరు గ్రామాల్లోకి ఇప్పటికే వరదనీరు ప్రవేశించింది.

- గోదావరి, శబరి నదుల వరద తాకిడికి వీఆర్‌పురం, కూనవరం మండలాల నడుమనున్న వంతెనపైకి వరదనీరు చేరింది. శబరినది ఎగపోటుకు గురవడంతో చింతూరు మండలంలో చింతూరు, ఏజీకొడేరు, కుమ్మూరు గ్రామాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరుతోంది.
- వరద కారణంగా నాలుగు మండలాల్లో 250 గ్రామాలకు చెందిన 15 వేల కుటుంబాలు ప్రభావితమైనట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మరోవైపు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ శనివారం కూనవరం మండలంలో ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టేలా చూస్తామని వారో భరోసా ఇచ్చారు.
- సహాయక చర్యలను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే పర్యవేక్షిస్తున్నారు. శనివారం కూనవరం, వీఆర్‌పురం మండలాలకు లాంచీల ద్వారా, చింతూరు మండలానికి పడవల ద్వారా కూరగాయలు, పాల ప్యాకెట్లను పంపించి సరఫరా చేశారు.
- ముంపు ప్రాంతాలకు చెందిన వరద బాధితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరేను కోరారు. స్థానిక ఐటీడీఏలో కలెక్టర్‌ను కలిసిన వారు మాట్లాడుతూ ముంపు ప్రాంతాల్లో బియ్యం, నిత్యావసరాలు, పాలు, టార్పాలిన్లు సరఫరా అయ్యేలా చూడాలని కోరారు. ఎస్టీ కమీషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, సర్పంచ్ కారం కన్నారావు, కోఆప్షన్ మెంబర్ అక్బర్‌అలీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి పాల్గొన్నారు.

## సహాయక చర్యలకు యంత్రాంగం సిద్ధం

### కలెక్టర్ సుమిత్‌కుమార్



చింతూరు: వరద సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివారం నుంచి వరద తగ్గుముఖం పట్టే అవకాశముందన్నారు. వరదకు 250 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయన్నారు. చింతూరు మండలంలో 8,500, వీఆర్‌పురంలో 4 వేలు, కూనవరం మండలంలో 6 వేల కుటుంబాలు ప్రభావితమైనట్లు ఆయన తెలిపారు. బాధితులకు కూరగాయలు, పాలతో పాటు కొవ్వొత్తులు పంపిణీ చేస్తున్నామని వివరించారు. సోమవారానికి కిరోసిన్ కూడా పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకుంటున్న వారికి అందించేందుకు 10 వేల టార్పాలిన్లను రప్పిస్తున్నట్టు చెప్పారు. కూనవరం మండలంలో 12, వీఆర్‌పురం మండలంలో 10, చింతూరు మండలంలో 8 మర పడవలను సహాయక చర్యలకు వినియోగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇళ్లు ఖాళీ చేసిన వారికి రూ 2 వేలు, ఇళ్లు దెబ్బతిన్న వారికి రూ.10వేల చొప్పున ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇవ్వనున్నట్టు చెప్పారు.

### ముంపుతో నిలిచిన రాకపోకలు

ఎటపాక: భద్రాచలం నుంచి నెల్లిపాక వరకు జాతీయ రహదారి నీటమునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గొల్లగూడెం, గన్నవరం, నందిగామ, గౌరిదేవిపేట, వీరాయిగూడెంకు చెందిన 250 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. నెల్లిపాక వద్ద విద్యుత్‌వైర్లు నీటమునగడంతో సుమారు 70 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మోటార్లు పనిచేయక పోవడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారు.

### జలదిగ్బంధంలో..

కూనవరం: వరద పెరుగుతున్న నేపథ్యంలో మండలంలో పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. అప్రమత్తమైన అధికారులు ముంపు గ్రామాలకు చెందిన పలు కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మండలంలోని చినార్కూరు, కొండ్రాజుపేట, శబరికొత్తగూడెం, కోతులగుట్ట, పైడిగూడెం, చూచిరేవులగూడెం, కొండాయిగూడెం పునరావాస కేంద్రాలను శనివారం సందర్శించారు. నిత్యావసరాలు, కూరగాయలు, పాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ గుజ్జా విజయ, ఎంపీపీ పాయం రంగమ్మ, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరా నిలిపివేత..

వీఆర్‌పురం: వరద ప్రభావంతో మండలంలో 30 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరద పెరుగుతుండటంతో మరిన్ని గ్రామాలు నీటమునిగే అవకాశముంది. విద్యుత్‌వైర్లు నీట మునగడంతో పలు గ్రామాలకు సరఫరా నిలిపివేయడంతో అంధకారం నెలకొంది. మినుము, కూరగాయల పంటలు, వరినార్లు ముంపునకు గురయ్యాయి.

### లాంచీలు, పడవల్లో సరఫరా

వరదముంపు ప్రాంతాలకు లాంచీలు, పడవల ద్వారా కూరగాయలను పంపించినట్లు ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే తెలిపారు. శనివారం చింతూరు వంతెన వద్ద కూరగాయల సరఫరాను ఆయన పరిశీలించారు. చింతూరు జీసీసీ గోడౌను నుంచి వీఆర్‌పురం, కూనవరం మండలాలకు మూడు టన్నుల చొప్పున ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, రెండు టన్నుల చొప్పున వంకాయలు, రెండు టన్నుల దొండకాయలు పంపించినట్లు తెలిపారు. జీసీసీ డీఎస్‌వో శ్రీహరి, డీఎం గణేష్‌కుమార్ పాల్గొన్నారు.



వడ్డిగూడెంలో సురక్షిత ప్రాంతానికి తరలివెళ్తున్న బాధితులు



కూరగాయలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ



చింతూరులో నీటమునిగిన వీఆర్‌పురం మార్గంలో దుకాణాలు



కుయిగూరు, కల్లేరుకు పడవలపై తరలిస్తున్న కూరగాయలు

## మీవల్లే అభివృద్ధికి ఆటంకం

మావోయిస్టులకు వ్యతిరేకంగా గిరిజనుల ర్యాలీ



వారపు సంతలో మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి: మావోయిజం వద్దు అభివృద్ధే ముద్దు అని శనివారం మండల కేంద్రంలో జరిగిన వారపు సంతలో మావోయిస్టులకు వ్యతిరేకంగా భారీ నినాదాలు చేస్తూ గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. గతంలో మావోయిస్టుల చేతిలో మృతి చెందిన వారి ఫొటోలను ముద్రించిన బ్యానర్లు, ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల వల్ల తమకు ఎటువంటి ఉపయోగం లేదని వారు నినాదాలు చేశారు. మావోయిస్టుల వల్ల గాలికొండ, ఎ.ధారకొండ అభివృద్ధికి నోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్య రంగాలు దూరమవడమే కాకుండా రహదారులు జరగనివ్వకుండా అడ్డుకున్నారని వారు ఆరోపించారు. ఇన్‌ఫార్మర్ల నెపంతో గిరిజనులను పొట్టన పెట్టుకున్నారని విమర్శించారు. ఇకపై వారి మాటలు నమ్మేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం మారుమూల గ్రామాలకు రహదారులు, విద్య, వైద్యం, గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తోందన్నారు. ప్రతీ చిన్న గ్రామాల్లో కూడా సెల్ టవర్లు ఏర్పాటు చేస్తోందని వారు పేర్కొన్నారు.

## సీజ్ చేసిన దుకాణాల కొనుగోలుకు బేరసారాలు

- రూ.16 లక్షలకు అమ్మకాలు జరిగినట్టు ప్రచారం
- చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరిక



రెండు షాపులు సీజ్ చేసిన తహసీల్దార్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది (ఫైల్)

పెదబయలు: పాడేరు సబ్ కలెక్టర్ సీజ్‌చేసిన రెండు దుకాణాల కొనుగోలుకు బేరసారాలు జరుగుతుండటం స్థానికంగా చర్చనీయాంశమైంది. మండలంలోని సీతగుంట పంచాయతీ ముసిడిపుట్టు రెవెన్యూలో 13-1, ప్రభుత్వ భూమి (కాలువ), 13-2 ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకొని ప్రభుత్వ భూమిలో బినామీ పేర్లతో అక్రమ నిర్మాణాలు చేపట్టారని సర్పంచ్ పలాసి మాధవరావు, ఎంపీటీసీ కె.బొంజుబాబు, వార్డు సభ్యులు గతంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పాడేరు సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు జరిపిన సర్వేలో ప్రభుత్వ భూమిగా గుర్తించారు. దీనిపై ఆయన ఆదేశాల మేరకు అప్పటి తహసీల్దార్ కుమారస్వామి 2022 ఫిబ్రవరి 10వ తేదీన సీజ్ చేశారు. ఇవి గ్రామం మధ్యలో ఉండటంతో వీటిపై కొంతమంది దృష్టి పడింది. టీడీపీ, ఇతర పార్టీల నేతలు కలిసి వీటిని రూ.16 లక్షలకు బినామీ పేరుతో అనధికారికంగా కొనిపించినట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై తహసీల్దార్ కృష్ణారావును వివరణ కోరగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సీజ్ చేసిన రెండు దుకాణాలను ఎవరు కొనుగోలు చేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

## నమ్ముకున్న వారికి న్యాయం

- అదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యం
- ఇందుకు కోలా గురువులే నిదర్శనం
- వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త సుబ్బారెడ్డి



కోలా గురువులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త సుబ్బారెడ్డి



గురువులను అభినందిస్తున్న సుబ్బారెడ్డి, మంత్రి రజని, చిత్రంలో ఎంపీలు ఎంవీవీ, భీశెట్టి సత్యవతి



బాధ్యతలు స్వీకరిస్తున్న కోలా గురువులు, చిత్రంలో వైవీ సుబ్బారెడ్డి, బూడి, తదితరులు

సాక్షి, విశాఖపట్నం: పార్టీని నమ్ముకుని, క్రమశిక్షణతో పనిచేసే వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేస్తారని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అదే సీఎం లక్షణమని చెప్పారు. ఇందుకు కోలా గురువులే నిదర్శనమన్నారు. శనివారం విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) నూతన చైర్మన్‌గా కోలా గురువులు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గతంలో గురువులను చట్టసభల్లో నిలబెట్టాలని ముఖ్యమంత్రి ప్రయత్నించారన్నారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రబాబు కుట్ర, వెన్నుపోటు రాజకీయాల వల్ల గురువులు ఓటమి పాలయ్యారన్నారు. మత్స్యకారుడికి అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి జగన్ గురువులకు డీసీసీబీ చైర్మన్ పదవిని కట్టబెట్టారని చెప్పారు. కాబోయే కార్యనిర్వాహక రాజధానికి జిల్లా అధ్యక్ష పదవిని కూడా ఇచ్చారన్నారు. నర్సీపట్నానికి చెందిన పార్టీ నాయకుడు, డీసీసీబీ పూర్వ చైర్‌పర్సన్ చింతకాయల అనిత భర్త సన్యాసిపాత్రుడుకు భవిష్యత్తులో మంచి పదవినిస్తారన్నారు. డీసీసీబీని సమర్థవంతంగా నిర్వహించాలని, రైతు సమస్యలపై దృష్టి సారించి వారికి సేవలందించాలని గురువులను ఆయన కోరారు.

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ పార్టీలో అంకితభావంతో పనిచేసే వారికి ముఖ్యమంత్రి జగన్ ఎంతటి ప్రాధాన్యత, గుర్తింపునిస్తారో గురువులే తార్కాణమన్నారు. గురువులు డీసీసీబీకి మంచి పేరు తీసుకురావాలని, బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసేవారికి సీఎం జగన్ మంచి అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. మరే పార్టీలోనూ ఈ తరహా జరగడం లేదని, అలాంటి పార్టీలో పనిచేస్తున్నందుకు గర్వంగా భావిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ మత్స్యకారులంటే సీఎం జగన్‌కు అపారమైన ప్రేమ ఉందన్నారు. మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్ష పదవులను మత్స్యకారునికే ఇవ్వడం గొప్ప విషయమన్నారు. చంద్రబాబు మత్స్యకారులను తాటతీస్తా, తోలు తీస్తా, అంతు చూస్తా.. అంటూ బెదిరిస్తే ముఖ్యమంత్రి జగన్ వారిని అందలమెక్కిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, గొల్ల బాబూరావు, తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, నెడ్‌క్యాప్ చైర్మన్, విశాఖ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు తదితరులు పాల్గొన్నారు.

### డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకారం

డీసీసీబీ కార్యాలయంలో నూతన చైర్మన్‌గా కోలా గురువులు శనివారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం గురువులను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ, అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ డీసీసీబీ కార్యాలయానికి వచ్చి గురువులుకు అభినందనలు తెలియజేసి వెళ్లారు. తనపై విశ్వాసంతో కీలక పదవులు కట్టబెట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఎప్పుడూ రుణపడి ఉంటానని గురువులు చెప్పారు.

# చేపల వేటకు వెళ్లి గిరిజనుడి మృతి

**ముంచంగిపుట్టు :** మండలంలోని మారుమూల రంగబయలు పంచాయతీ పట్నాపడాల్‌పుట్టు గ్రామంలో మత్స్యగెడ్డలో చేపల వేటకు వెళ్లిన గిరిజనుడు ప్రమాదవశాత్తూ గెడ్డలో పడి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పట్నాపడాల్‌పుట్టు గ్రామానికి చెందిన సీసా కామేష్(25) శనివారం ఉదయం చేపల వేట కోసం పుట్టు, పట్నాపడాల్‌పుట్టు గ్రామాల మధ్య ఉన్న మత్స్యగెడ్డలో నాటు పడవపై చేపలు పడుతూ ఉండగా అదుపు తప్పి గెడ్డలో పడిపోయాడు. ఒడ్డున ఉన్న గిరిజనులు కేకలు వేస్తూ గెడ్డ వైపు పరుగులు పెట్టారు. అప్పటికే కామేష్ కనిపించకుండా పోయాడు. పట్నాపడాల్‌పుట్టు, కోసంపుట్టు, జోడిగుమ్మ గిరిజనులు నాటు పడవలపై ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక సర్పంచ్ ధనియా, ఎంపీటీసీ భాగ్యవతి, వలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు దేవాల ఆధ్వర్యంలో ఆచూకీ కోసం వెతికారు. చీకటి పడుతుండడంతో గాలింపు చర్యలు ఆపేద్దాం అనుకుంటున్న సమయంలో రాత్రి 7గంటలకు జోడిగుమ్మ గ్రామ సమీపంలో కామేష్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పట్నాపడాల్‌పుట్టు తరలించారు. మృతుడికి ముగ్గురు పిల్లలు, భార్య ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోయి, ఆ కుటుంబం దిక్కులేని పరిస్థితిలో ఉందని, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు, సర్పంచ్ ధనియా, ఎంపీటీసీ భాగ్యవతి కోరారు.



# జగనన్న సురక్షతో సకల సమస్యల పరిష్కారం

## అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


హుకుంపేటలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు

**హుకుంపేట:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సకల సమస్యలు పరిష్కారమవుతున్నాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. స్థానిక సచివాలయ కేంద్రంలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు మంజూరైన 1098 ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు, సేవలన్నీ సంపూర్ణంగా అందజేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా 11రకాల ధ్రువపత్రాలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మండలంలో ఇప్పటి వరకు 20,799 ధ్రువపత్రాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. మండలంలో రూ.500కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేశామన్నారు. ఇప్పటివరకు 21తారు రోడ్లు నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు కామయ్యపేట ప్రధాన రహదారి పనులకు 4వ తేదీన శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. తీగలవలసలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం 489 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు మంజూరు చేశారు.

ఎంపీపీ కూడా రాజుబాబు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, డీటీ రంగారావు, ఈవోపీఆర్డీ అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడు శామ్యూల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కొండలరావు, సర్పంచ్‌లు సమిడ పూర్ణిమ, బేసు, సాంబ, సింహాచలం, బొంజుబాబు, ఎంపిటీసీ నాగరాజు, వైస్ సర్పంచ్ గోవింద్, ఎంఎల్‌వో శివ, నాయకులు మహేష్, భూషణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### జగనన్నకు రుణపడి ఉంటాం



జగనన్న పాలనలో ఇంటి వద్దకే సేవలందుతున్నాయి. గతంలో ధ్రువీకరణ పత్రాలు కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాల్సి వచ్చేది. అయితే జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వార ఇంటివద్దకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు.అన్ని రకాల సమస్యలు పరిష్కారమవుతున్నాయి. చాలాఆనందంగా ఉంది. జగనన్నకు రుణపడి ఉంటాం.

– గులివిందుల నీలవేణి, ఓలుబెడ్డా గ్రామం, తీగలవలస సచివాలయం, హుకుంపేట మండలం.

# విస్తారంగా వర్షాలు


అరకు రోడ్డులో ట్రాక్టర్‌పై గొడుగులతో ప్రయాణిస్తున్న గిరిజనులు


పాడేరు-పెదబయలు రోడ్డులోని గంపరాయి బ్రిడ్జి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ

**సాక్షి, పాడేరు:** జిల్లా వ్యాప్తంగా ఈదురుగాలులతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ పరిస్థితులు ఖరీఫ్‌కు అనుకూలంగా ఉండడంతో గిరి రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రధాన వాగులు, గెడ్డల్లో వరద ఉధృతి నెలకొంది. ఈదురు గాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. జోలాపుట్టు జలాశయనికి ఇన్‌ఫ్లో పెరిగింది. రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది.

**వర్షపాతం వివరాలు**
ముంచంగిపుట్టు 15.4 మిల్లీమీటర్లు, జి.మాడుగులలో 6.4, జి.కే.వీధిలో 4.2, పెదబయలులో 4.2, మారెడుమిల్లిలో 3.2, చింతపల్లిలో 2.4, అడ్డతీగలలో 2, వి.ఆర్.పురంలో 1.6, కూనవరంలో 1, వై.రామవరంలో 0.8, ఎటపాకలో 0.8, దుంబ్రిగుడలో 0.6, అరకులోయలో 0.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# ముమ్మరంగా తనిఖీలు

## మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తం


ముంచంగిపుట్టు వారపు సంతలో గస్తీ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు


వై.రామవరంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

**ముంచంగిపుట్టు:** మండల కేంద్రంలో శనివారం ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా మారుమూల బూసిపుట్టు, కుమడ, బాబుశాల, రంగబయలు, బుంగాపుట్టు పంచాయితీల నుంచి వచ్చే ఆటోలు, జీపులు, ద్విచక్రవాహనాలను ఆపి ప్రయాణికుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. లగేజీలు,బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితుల వివరాలు సేకరించి విడిచి పెట్టారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు వారపు సంత నలుమూలల డేగ కన్నుతో పహారా కాశాయి. ఏవోబీలోని మాచ్‌ఖండ్, జోలాపుట్టు బీఎస్‌ఎఫ్ బలగాలు సైతం సరిహద్దు రాకపోకలపై పూర్తి దృష్టిశారించాయి. ముంచంగిపుట్టు,పెదబయలు మండలాల్లోని మారుమూల గిరిజన గ్రామాల పరిసరాల్లో మూడు రోజులుగా గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ పోలీసు బలగాలు అడవి అంతా జల్లెడ పడుతూ కూంబింగ్ నిర్వహిస్తున్నాయి.

**వై.రామవరం:** మండలంలో లోతట్టు ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారిలో శనివారం అడ్డతీగల సీఐ వై.రాంబాబు సూచనల మేరకు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. అపరిచితులు, అనుమానస్పద వ్యక్తులపై గట్టి నిఘా విధించారు.

**చింతపల్లి రూరల్:** మావోయిస్టుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శనివారం మండలంలో అంతర్ల, చెరుకుంపాకలులో చింతపల్లి ఎస్‌ఐ అరుణ్‌కిరణ్, అన్నవరం ఎస్‌ఐ రమణ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు.

# బైక్ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన వాహనచోదకుడు

**జి.మాడుగుల :** పాడేరు-జి.మాడుగుల రోడ్డు మార్గంలో కె.కోడాపల్లి గ్రామం వద్ద ద్విచక్ర వాహనం ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలివి. పాడేరు మండలం వంతాడపల్లి సచివాలయం పరిధి లో జోడుమామిడి గ్రామానికి చెందిన చర్చి పాస్టర్ కొర్రా వరుణ్, భార్య, చంటి బిడ్డతో బైక్‌పై శనివారం రాత్రి 7:30 గంటల సమయంలో జి.మాడుగుల మండలం వేర్లమామిడి గ్రామానికి బైక్‌పై వస్తుండగా కె. కోడాపల్లి గ్రామం వద్ద రోడ్డు మధ్యలో నడుస్తున్న వ్యక్తిని ఢీ కొట్టాడు. దీంతో ఇదరికీ తీవ్ర గాయాలయ్యాయి. బైక్ ఢీకొన్న వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండడంతో అతని వివరాలు తెలియరాలేదు. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. గాయపడిన ఇద్దరికీ పాడేరు 108 వాహనం సిబ్బంది ఈఎన్‌టీ రవి, పైలట్ లక్ష్మణ్ ప్రథమ చికిత్స అందించి, పాడేరులోని జిల్లా ఆస్పత్రికి మెరుగైన వైద్యం నిమిత్తం తరలించారు.

# బీజేపీ మహిళా నేత ప్రణితశేఖర్‌కు సత్కారం


ప్రణిత శేఖర్‌ను సత్కరిస్తున్న మఠం సర్పంచ్ శాంతికుమారి, ఏబీవీపీ నాయకులు

**సాక్షి,పాడేరు:** బీజేపీ జాతీయ మహిళా పాలసీ రిసెర్చ్ కన్వీనర్ ప్రణితశేఖర్ శనివారం పవిత్ర పుణ్యక్షేత్రం మత్స్యగుండంను సందర్శించారు. ఇక్కడ మత్స్యలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి, మఠం సర్పంచ్ మఠం శాంతికుమారి, ఏబీవీపీ నేత కొండబాబు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు ఆమెను సత్కరించారు.